సాక్షి నంద్యాల

బుధవారం ; 6 ; మార్చి ; 2024



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ నిత్యకళావేదికపై ఏర్పాటు చేసిన నృత్యం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు మంగళవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



భక్తుల సేవలో..

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రెడ్‌క్రాస్ సభ్యులు భక్తులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

కన్నీళ్లు తుడుస్తూ.. కష్టం తీరుస్తూ!



అనావృష్టితో దెబ్బతిన్న పత్తి పైరు

కరువు రైతుకు కొండంత భరోసా

- కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 6 కరువు మండలాల గుర్తింపు
- ఇన్‌పుట్ సబ్సిడీకి గత డిసెంబర్‌లో నివేదికలు
- మూడు నెలల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లాకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- 3,75,244 మంది రైతులకు తక్షణ ఉపశమనం
- నేడు వర్చువల్‌గా నిధులు విడుదల చేయనున్న సీఎం

రైతుల కష్టం తెలిసిన సీఎం



మాకు ఐదు ఎకరాల పొలం ఉంది. పత్తి, ఎండుమిర్చి, టమాట సాగు చేస్తున్నాం. 2023–24లో కరువు కారణంగా అనావృష్టితో చాలా నష్టపోయాం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎలాంటి జాప్యం లేకుండా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తుండటం చాలా ఊరటనిస్తోంది. రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కావడంతోనే ఇంత చేస్తున్నారు.

– ఈరన్న, వందగల్లు, కోసిగి మండలం

కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత భరోసా కల్పిస్తున్నారు. వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. తక్షణ ఉపశమనం కలిగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టం అన్నదాతల్లో ఆనందం నింపుతోంది. కోటి, రెండు కోట్లు కాదు.. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఏకంగా రూ.460.47 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటం విశేషం. వైఎస్సార్‌సీపీ పాలనలో మొదటిసారి 2023–24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆయా జిల్లాల యంత్రాంగం పంపిన ప్రతిపాదనల మేరకు కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలు, నంద్యాల జిల్లాలో 6 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్ నెల మొదటి వారంలో ఇన్‌పుట్ సబ్సిడీ కోసం జిల్లాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. సరిగ్గా మూడు నెలల్లో కరువు రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తుండటం విశేషం. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు జమ చేయనున్నారు.

నేడు రూ.460.57కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో ఈ–క్రాప్ డేటా ప్రకారం 2 హెక్టార్ల వరకు పంట నష్టం నమోదు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కర్నూలు జిల్లాలో వ్యవసాయ పంటలు 2,38,230.92 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 2,90,741 మంది పంటలను నష్టపోయినట్లు గుర్తించారు. ఈ రైతులకు రూ.371.05 ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలవుతోంది. జిల్లాలో అత్యధికంగా 1,63,651.9 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతినగా.. ఇన్‌పుట్ సబ్సిడీ రూ.278.20 కోట్లు చెల్లించేందుకు రంగం సిద్ధమవుతోంది.

- ఉద్యాన పంటలకు సంబంధించి 36,855.25 హెక్టార్లలో టమాట, ఉల్లి, ఎండుమిర్చి, పచ్చిమిర్చి పంటలు దెబ్బతిన్నాయి. 57,365 మంది రైతులు ఉద్యాన పంటలను నష్టపోయారు. ఉద్యాన రైతులకు రూ.62.65 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కానుంది.
- నంద్యాల జిల్లాలో కరువు ప్రాంతాలుగా గుర్తించిన ఆరు మండలాల్లో 22,812 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 27,138 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.26.87 కోట్లు విడుదలవుతోంది.

ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు ఇలా..

సవరించిన స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలవుతోంది. వరి, వేరుశనగ, పత్తి, చెరకు, పసుపు, మిరప, కూరగాయలు, ఉల్లి, పూలు, బొప్పాయ పంటలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం హెక్టారుకు రూ.17 వేలు ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తారు. చంద్రబాబు పాలనలో ఈ పంటలకు రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తుండటం గమనార్హం.

- గతంలో మొక్కజొన్నకు ఎలాంటి పరిహారం లేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మొక్కజొన్నకు హెక్టారు రూ.12,500 పరిహారం చెల్లిస్తుండటం విశేషం.
- జొన్న, సజ్జ, రాగులు, ఆముదం, నువ్వులు, కొర్ర, జనపనార, సామలు, వరిగలు, తెల్లకుసుమలు, పంటలకు పరిహారం రూ.8,500 ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తారు.
- పప్పుదినుసుల పంటలు, పొద్దుతిరుగుడు, సోయాబీన్, వాము, పొగాకు పంటలకు రూ.10వేల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తారు.

నెలలోనే ఇన్‌పుట్ సబ్సిడీ

అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటే రైతులకు ఉపశమనం కలిగించేందుకు కేవలం 45 రోజుల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించిన ఘనత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుంది. 2019–20 నుంచి 2021–22 వరకు అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు రూ.115.29 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. చంద్రబాబు పాలనలో అధిక వర్షాలు, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటే రెండేళ్లకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కాని పరిస్థితి.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2023–24 సంవత్సరంలో వర్షాభావ పరిస్థితులతో ప్రభుత్వం 24 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో పంట నష్టంపై పకడ్బందీగా ఎన్యూమరేషన్ చేపట్టి డిసెంబర్ మొదటి వారంలో ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాము. ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.433.70 కోట్లు జమ చేయనున్నారు.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

నియోజక వర్గాల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా..

నియోజకవర్గం	లబ్ధి పొందే రైతులు	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లలో)
కోడుమూరు	42,210	41.53
పాణ్యం (కల్లూరు,పాణ్యం)	22,476	22.47
మంత్రాలయం	64,523	82.56
ఆదోని	29,864	39.99
ఆలూరు	74,868	113.15
పత్తికొండ	64,314	70.62
ఎమ్మిగనూరు	49,478	63.08
కర్నూలు	373	0.30
మొత్తం	3,48,106	433.70

నంద్యాల జిల్లాలో ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు

నియోజకవర్గం	లబ్ధి పొందే రైతులు	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లలో)
బేతంచెర్ల	11,999	11.12
బనగానపల్లి	4,888	4.89
గడివేముల	1,030	1.08
మిడుతూరు	5,605	6.10
పగిడ్యాల	3,264	3.23
పాణ్యం	352	0.42

న్యూస్‌రీల్

మహానందికి బయలుదేరిన బ్రహ్మనందీశ్వరుడు



మహానందికి తరలివెళ్తున్న గంగా పార్వతి సమేత బ్రహ్మనందీశ్వర స్వామి

నంద్యాల(వ్యవసాయం)/మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహానందీశ్వర స్వామి కల్యాణానికి పెళ్లి పెద్దలు గంగా పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి మంగళవారం మహానందికి బయలుదేరి వెళ్లారు. ఆనవాయితీలో భాగంగా తమ వివాహానికి హాజరుకావాలని కామేశ్వరి సహిత మహానందీశ్వరస్వామి సోమవారం నంద్యాలకు వెళ్లారు. దీంతో ఉదయం బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్, కల్పనాసెంటర్, బైటి పేట ఆంజనేయస్వామి దేవస్థానం, పప్పుల బట్టి బజారు మీదుగా మహానందికి బయలుదేరారు. రాత్రి 11 గంటలకు మహానందికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

నంద్యాల(అర్బన్): పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా చూసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రోగులు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించడం సంతోషకరమన్నారు. మండలంలోని పోలూరు గ్రామంలో మంగళవారం మండల వైద్యాధికారి షహలంతో కలిసి డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో విజయవంతం చేయడం అందరి బాధ్యత అన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. హాల్‌టికెట్ చూపించి బస్సులో ప్రయాణించి పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 30,295 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు తమ సెంటర్లకు పల్లెవెలుగు బస్సుల్లో చేరుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల టెన్త్ పేద, మధ్యతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని టెన్త్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం రజియాసుల్తానా సూచించారు. కండక్టర్‌కు హాల్‌టికెట్ చూపిస్తే చాలని, పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆమె తెలిపారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉచిత సదుపాయం ఉంటుందన్నారు.

మద్దతు ధరతో దిగుబడుల కొనుగోళ్లు

నంద్యాల (సెంట్రల్): జిల్లావ్యాప్తంగా ఈ–క్రాప్ ఈ–కేవైసీ చేయించుకున్న రైతన్నల నుంచి మద్దతు ధరకు శనగలు, మినుములు, పెసలు, వేరుశనగ కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకేల వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతన్నలు సంబంధిత వ్యవసాయ సహాయకులను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. శనగకు మద్దతు ధర క్వింటా రూ.5,440, మినుములు రూ.6,950, పెసలు రూ.8,558, వేరుశనగ రూ.6,337 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నిర్దేశించిన మేరకు తేమ శాతం, వ్యర్థ పదార్థాల పరిమాణం ఉన్న దిగుబడులను మాత్రమే అన్నదాతలు తీసుకురావాలని సూచించారు.

27న పాలిసెట్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పాలిసెట్) నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీహెచ్ శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత స్టడీ మెటీరియల్ https://-polycetap.nic.in/Default..aspx లో అందుబాటులో ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అఖిలప్రియ ఆగడాలను అడ్డుకుంటాం

- భూమా కిషోర్‌రెడ్డి



ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్ ఆగడాలకు అడ్డుకునేందుకే వైఎస్సార్‌సీపీలో చేరానని భూమా కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లుగా ఆళ్లగడ్డలో అఖిలప్రియ కిడ్నాపులు, భూ కబ్జాలు మితిమీరిపోయాయన్నారు. ఇంటికి వచ్చిన వారిని సైతం కొట్టి డబ్బు లాక్కున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే ఓట్లు చీలి అఖిలప్రియ గెలిస్తే ఆమె దౌర్జన్యాలు మరింత ఎక్కువై, నియోజవర్గ అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కు పోతుందనే భయంతోనే పోటీ నుంచి విరమించుకున్నానన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉండి అఖిలప్రియ ఓటమికి, బిజేంద్రారెడ్డి విజయానికి కృషి చేస్తానన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో వివిధ పథకాల కింద బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు రూ.1,645 కోట్ల నగదు వారి ఖాతాలో జమ అయిందన్నారు. అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే హక్కు తమకు ఉందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఇన్ని మంచి పథకాలను ఎందుకు అమలు చేయలేక పోయారన్నారు. టీడీపీ హయాంలో నీరు–చెట్టు పేరుతో నాయకులు దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ ప్రయస్తున్న ప్రతిసారీ ఇక్కడి టీడీపీ నాయకుడు బీసీ జనార్దన్‌రెడ్డి కోర్టులకు వెళ్లి అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారికి పేదలు బాగుపడటం ఇష్టం లేదన్నారు. అందుకే పేదల మేలు కోరే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేకోవాల్సిన ఆవసరాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జేసీఎస్ నియోజవర్గ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిగారి రామిరెడ్డి, పేరం నందకిషోర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ఇంటి స్థలాలకు చెందిన రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇంటి పట్టాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత ఇలా ప్రతి పథకం మహిళల పేరు మీదనే ఏర్పాటు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మహిళలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత బాయి, ఎంపీడీ సాయికృష్ణ, డీటీ నాగేశ్వరరెడ్డి, హౌసింగ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 18 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 నిర్వహించనున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ 30న ఉంటాయని ఓపెన్ స్కూల్ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 3,032 మంది ఓపెన్ టెన్త్ విద్యార్థులకు 20 పరీక్ష కేంద్రాలు, 1,518 మంది ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఈనెల 6 నుంచి స్టడీ సెంటర్ల ద్వారా హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి



పెసరవాయి గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

గడివేముల: సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెసరవాయి, చిందుకూరు గ్రామా పోలింగ్ కేంద్రాలను మంగళవారం వారు పరిశీలించారు. పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వారివెంట నంద్యాల డీస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ ఎల్లా సుబ్బయ్య, వీఆర్వో హరీంద్ర, సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

శ్రీగిరి ఉత్సవం..నేత్రానందభరితం

- కొనసాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం



రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రానందభరితంగా సాగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులో భాగంగా ఐదవ రోజు మంగళవారం నీలకంఠుడు భ్రమరాంబా సమేతుడై దశకంఠుడి భుజస్కంధాలపై ఊరేగాడు. ఉభయ ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో రావణవాహనాన్ని సుగంధ పుష్పాలతో అలంకరించి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. ప్రధాన అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజా హారతలనిచ్చి అక్కడి నుంచి నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం మధ్య సాగిన గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పట్టువస్త్రాల సమర్పణ

ఆనవాయితీ ప్రకారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం తరపున భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశ్ కుటుంబ సమేతంగా హాజరై పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం కాణిపాకం చైర్మన్, ఈఓ, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు పట్టువస్త్రాలను స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.


నేడు పుష్పపల్లకీసేవ

బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు బుధవారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకీ సేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం ఉంటుంది.



స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కాణిపాకం ఆలయ చైర్మన్, ఈఓ





శివుడి వేషధారణలో భక్తుడు, పాతాళగంగలో దీపాలు వదులుతున్న మహిళలు

బేతంచెర్ల చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు



విద్యార్థిని సీతామహాలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన నరసింహకుమార్, సీతామహాలక్ష్మి దంపతుల కుమార్తె సీతామహాలక్ష్మి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. 1వ తరగతి చదువుతున్న సీతామహాలక్ష్మికి తల్లిదండ్రులు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. చిన్నారి వేగంగా నేర్చుకుంటుండటం గమనించి ప్రోత్సహించారు. 40 శ్లోకాలను 5 నిమిషాల 58 సెకండ్లలో చెబుతుండటంతో వీడియో తీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారికి పంపగా వారు చిన్నారి ప్రతిభను గుర్తించి ఇండియా బుక్ రికార్డు ప్రశాంసా పత్రం, మెడల్‌ను అందజేశారు. కాగా మంగళవారం సీతామహాలక్ష్మిని సుమేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిర్వాహకులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 622 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ పరీక్షలకు మంగళవారం 622 మంది గైర్హాజరయ్యారని డీవీఈఓ సునిత తెలిపారు. 10,249 మంది ఇంటర్ విద్యార్థులకు గానూ 9,698 మంది హాజరయ్యారని, 551 మంది గైర్హాజరరని తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,002 మందికి గానూ 931మంది హాజరయ్యారని, 71 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు.

క్లుప్తంగా

ఖనిజ రవాణా లారీలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా ఖనిజాన్ని రవాణా చేస్తున్న రెండు లారీలను జిల్లా మైనింగ్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున జోన్ దగ్గర అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టేటెడ్ ఖనిజాన్ని తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేసి రూ.25వేలు జరిమానా విధించారు. అలాగే వెల్దుర్తి దగ్గర రోడ్డు మెటల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి రూ.12వేలు ఫైన్ వేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి తీర్పు వెలువరించినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. నివర్తీనగరకు చెందిన కుంటి వెంకటేష్ మద్యం తాగి ఎన్‌జీఓ కాలనీ మెయిన్ రోడ్డులో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నేరం నిర్ధారణ కావడంతో జడ్జి 14 రోజులు జైలు శిక్షలు ఖరారు చేశారు. అలాగే కోటా వీధికి చెందిన గురుబాబు, శ్రావణ్ తిమ్మాపురం బస్టాండ్ రోడ్డు వద్ద మద్యం తాగుతూ కారులో వెళ్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అక్కడివారు మహానంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి 20 రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నం

- అధిక వడ్డీపై ప్రశ్నించినందుకు కత్తితో దాడి

బొమ్మలసత్రం: అధిక వడ్డీపై ప్రశ్నించినందుకు ఆటోడ్రైవర్ రాజుపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. నంద్యాల పట్టణానికి చెందిన రాజు ఆటో నడపుతూ జీవనం సాగిస్తున్నాడు. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి రాముడితో ఆటోడ్రైవర్లు అప్పు తీసుకుంటూ చెల్లిస్తూ ఉంటారు. ఇలాగే ఆటో డ్రైవర్ రాజు స్నేహితుడొకరు కొంత కాలం క్రితం రాముడితో అప్పు తీసుకున్నాడు. రూ.20 చొప్పున చెల్లించాలని రాముడు డిమాండ్ చేస్తుండటంతో అంత వడ్డీ ఎందుకని రాజు ప్రశ్నించడంతో కోపోద్రిక్తుడై కత్తితో దాడి చేశాడు. గాయపడిన రాజును తోటి ఆటోడ్రైవర్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

PUBLIC NOTICE

Notice is hereby given to whom so ever it may concern that my client intended to purchase agriculture land total admeasuring Ac. 13-34 cents. in Sy.No. 819, situated at Parumanchala Village, Jupadu Bunglow Mandal, Nandyal Dist. Andhra Pradesh from its owner names 1) Patan Allabakash S/o Patan Mahaboob Khan, 2) Patan Taslim Bhanu, Hussanepauram Village, Banaganapalli Mandal, Nandyal Dist.

Any person having any right title or interest in the aforesaid land or having any objection for the sale of the said land to my client, may contact the undersigned with relevant documents within 7(seven) days from the date of publication of this notice, failing which my client will proceed to complete the sale transaction with the owners of the aforesaid land by execution of registered sale deed, and no subsequent objection or claim, whatsoevere shall be entertained.

K.BHASKAR, Advocate
H.No. 25-125, ABM Palem, Nandikotkur, Nandyal Dist. Pin-518401. Cell: 9441731216

ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.,
ఇంటి నెం. 46-1-సి, బుధవారపేట,
ప్రభుత్వ కంటి హాస్పిటల్ ఎదురుగా, కర్నూలు - 518 002.

తేది: 27.02.2024

ఖాతాదారులకు విజ్ఞప్తి

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు యొక్క డెబిట్/ కె.సి.సి. కార్డు సేవలను వినియోగిస్తున్న ఖాతాదారులు వారి డెబిట్/ కె.సి.సి. కార్డు యొక్క గడువు తేదీని గమనించుకొని సంబంధిత బ్యాంకు బ్రాంచీల యందు గడువు తేది ముగిసిన కార్డు స్థానంలో నూతన కార్డును పొంది మా యొక్క నిరంతర సేవలను వినియోగించుకోవలసినదిగా మా విజ్ఞప్తి.

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి ఇంచార్జి

భారమైనా.. పంటలను బతికించేలా..

- పంటలు ఎండకుండా తొమ్మిది గంటల ఉచిత విద్యుత్
- యూనిట్ రూ.12 ప్రకారం ప్రతి రోజూ 5 లక్షల యూనిట్ల కొనుగోలు
- రైతుల కోసం రోజుకు ఒక్క ఉమ్మడి జిల్లాలో రూ.60 లక్షల భారం
- రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణీత వేళల్లో విద్యుత్ సరఫరా



బోర్ల కింద పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): బోర్లు, బావులు, ఇతర నీటి వనరుల కింద రైతులు సాగు చేసిన వివిధ పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క ఎకరా పంట కూడా ఎండరాదనే ఉద్దేశంతో ప్రతి రోజూ రూ.60 లక్షల భారాన్ని భరిస్తోంది. పంటలు ఎండకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది గంటల విద్యుత్

హంద్రీ-నీవా సుజ స్రవంతి పథకం, ఇతర నీటి వనరుల కింద కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రైతులు ఆరుతడి పంటలైన వేరుశనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, మినుము, వివిధ కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలో వ్యవసాయానికి సంబంధించి 738 ఫీడర్లు ఉన్నాయి. వివిధ ఫీడర్లలో పంటలు వాడుముఖం పట్టాయని ఇటీవల ప్రభుత్వం దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. విద్యుత్ కారణంగా ఒక్క ఎకరాలో కూడా పంటలు ఎండరాదని, తొమ్మిది గంటల విద్యుత్ ఇచ్చేందుకు తక్షణం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

ఇప్పటికే వేసవి తీవ్రత పెరిగింది. రోజు, రోజుకు పంటలకు నీటి అవసరం పెరుగుతోంది. విద్యుత్‌కు డిమాండ్‌కు కూడా క్రమంగా పెరుగుతోంది. పంటలు ఎండకుండా 9 గంటల విద్యుత్ ఇవ్వాలంటే వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆదోని, ఎమ్మిగనూరు, మాధవరం, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని ట్రాన్స్‌కో పెంచింది. ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం 30 ఎంఎస్‌ఏగా ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం 30 నుంచి 50 ఎంఎస్‌ఏకు పెంచారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో 9 గంటల విద్యుత్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడింది. అంతేగాక ఏపీఎస్‌పీడీసీఎల్ వ్యవసాయానికి ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయం కోసం నెలకు 1000 ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వ్యవసాయానికి విద్యుత్ సమస్య ఉత్పన్నం కావడం లేదు. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకపోవడం విశేషం.

చర్యలు తీసుకుంటున్నాం



ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇచ్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ఉమ్మడి జిల్లాలో 738 ఫీడర్లు ఉండగా.. వీటి పరిధిలో బావులు, బోర్లు, కాల్వల కింద ప్రస్తుతం వివిధ పంటలు సాగయ్యాయి. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో పంటలు ఎండకుండా తగిన చర్యలు తీసుకున్నాం. రైతుల సూచనల మేరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఎలాంటి ఢోకా లేదు.

– ఎం.ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ప్రభుత్వంపై రూ.60 లక్షల భారం

కాల్వలు, బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోజుకు రూ.60 లక్షలు ఖర్చు చేస్తోంది. జిల్లాలోని 738 ఫీడర్లలో సాగు చేసిన పంటలకు తొమ్మిది గంటల విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాకు రోజుకు 5 లక్షల యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేస్తోంది. ఒక యూనిట్ విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం రూ.12 ఖర్చు చేస్తోంది. అంటే తొమ్మిది గంటల విద్యుత్ కోసం రోజుకు రూ.60 లక్షలు ప్రకారం నెలకు రూ.18 కోట్లు ఖర్చు చేస్తోంది. అన్నదాతలు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ మొత్తాన్ని భరిస్తోంది. పంటలు చేతికి వచ్చే వరకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా ఇవ్వడానికి అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా అధికారులు విద్యుత్ ఇస్తున్నారు. పగటి పూట 7, రాత్రి సమయంలో 2 గంటల ప్రకారం, లేదంటే పగలు 5 గంటలు, రాత్రి 4 గంటల ప్రకారం విద్యుత్ ఇస్తున్నారు. రైతుల సూచనలకు అనుగుణంగానే పంటలకు విద్యుత్ ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 మండల ప్రజా పరిషత్తులకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25.63 కోట్లు విడుదలైనట్లు జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ గ్రాంట్ కింద జెడ్పీకి రూ.5,12,38,547, మండల పరిషత్‌లకు రూ.5,12,87,973 విడుదలయ్యాయన్నారు.అలాగే టైడ్ గ్రాంట్ కింద జెడ్పీకి రూ.7,68,78,969, మండల పరిషత్తులకు రూ.7,69,57,768 విడుదలయ్యాయని తెలిపారు. ఈ నిధులను జెడ్పీ, మండల పరిషత్ బ్యాంకు ఖాతాలకు జమ చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని ఖర్చు చేయాలని ఆయన ఎంపీడీఓలను ఆదేశించారు.

దేవదాయశాఖలో ఈఓల బదిలీ

కర్నూలు కల్చరల్: దేవదాయశాఖలో పలువురు ఈఓలకు బదిలీలు, పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా మహా గోరక్షణ సంఘం (గోశాల) ఈఓగా శోభ నియమితులయ్యారు. అనంతపురం జిల్లా నార్పల మండలం గూగూడు కుల్లాయిస్వామి ఆలయం ఈఓగా ఉన్న శోభకు గోశాల ఎఫ్ఏసీ ఈఓగా బాధ్యతలు అప్పగించారు. నంద్యాల సర్వ నరసింహాస్వామి ఆలయం గ్రేడ్-2 ఈఓ బి.వి. నరసయ్యకు గ్రేడ్-1 ఈఓగా పదోన్నతి కల్పించి నాగలాపురం సుంకులా పరమేశ్వరి గ్రూప్ ఆలయం ఈఓగా పోస్టింగ్ ఇచ్చారు. నందికొట్కూరు గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-3 ఈఓ వెంకటరమణకు గ్రేడ్-2 ఈఓగా పదోన్నతి కల్పించి మిడ్తూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓగా నియమించారు.

కర్నూలులో విద్యా ప్రమాణాలు భేష్



డైట్ కాలేజీలో ఐబీ బృందం

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటర్నేషనల్ బకలారియట్(ఐబీ) కరికులమ్‌పై ప్రాజెక్టు బృందం మంగళవారం కర్నూలు జిల్లాలో పర్యటించింది. ప్రభుత్వ డైట్ కాలేజీ, ప్రభుత్వ ఉర్దూ, ఉన్నత పాఠశాలలను సందర్శించింది. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విషయ నైపుణ్యాలను తెలుసుకుంది. నాణ్యమైన విద్య, నైపుణ్యవంతమైన బోధన మెరుగైన ఫలితాలు ఇస్తుందని, అంతర్జాతీయ స్థాయి జ్ఞానానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఐబీ సీనియర్ మేనేజర్, అమెరికాకు చెందిన వెండీగ్రేస్, ఐబీ పర్సనల్ డెవలప్‌మెంట్ అధికారి, ఇంగ్లాండ్ ఎరిక్ బాబర్ ఉన్నారు. వీరి వెంట డీఈఓ కె.శామ్యూల్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామూల్ పాల్, డైట్ కాలేజీ ప్రిన్సిపల్ వసుంధరా దేవి ఉన్నారు.

భక్తులకు ఉచిత బస్సు ప్రయాణం



ఉచిత బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత సౌకర్యాలు కల్పిస్తోంది. క్షేత్రం పరిధిలో భక్తులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు 10 బస్సులను కేటాయించింవది. కైలాస ద్వారం, హటకేశ్వరం, పాలధార-పంచధార, సాక్షిగణపతి ఆలయం, దేవస్థానం టోల్‌గేట్, టూరిస్ట్‌బస్టాండ్, గణేశసదనం, యజ్ఞవాటిక వాహనాల పార్కింగ్, దేవస్థానం గోసంరక్షణశాల, మల్లమ్మ కన్నీరు, ప్రైవేట్ సత్రాలు, దేవస్థానం అతిథి గృహాలు, రుద్ర పార్క్, గంగాభవాని స్నానఘట్టాలు, ఆలయ పుష్కరిణి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కల్యాణకట్ట, దేవస్థానం డార్మెటరీ, పాతాళగంగరోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ప్రైవేట్ సత్రాలు, దేవస్థానం టోల్‌గేట్ వరకు బస్సులలో ప్రయాణించవచ్చు. భక్తులు వారి వారి వసతి గదుల నుంచి ఆలయానికి, లడ్డూ ప్రసాదాల కౌంటర్‌కు, తిరిగి వసతి గదులకు చేరుకునేలా ఉచిత బస్సు సౌకర్యాన్ని దేవస్థానం కల్పిస్తుంది. ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుంది. బ్యాటరీ వాహనాలు-5 ఉన్నాయి. వాటి ద్వారా కూడా భక్తులు ఉచిత ప్రయాణం చేయవచ్చు. వృద్ధులు, దివ్యాంగుల కోసం 25 వీల్‌చైర్స్‌ను దేవస్థానం అందుబాటులో ఉంచింది.

కలిసికట్టుగా పార్టీని గెలిపించుకుందాం



కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు,



మాట్లాడుతున్న పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

- వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులకు రీజినల్ కో–ఆర్డినేటర్ రామ సుబ్బారెడ్డి పిలుపు
- ఎన్‌ఆర్‌పేటలో కర్నూలు నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయం ప్రారంభం

కర్నూలు (టౌన్) : అందరం కలిసికట్టుగా ఉండి పార్టీని గెలిపించుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక నరసింగరావు పేటలో కర్నూలు నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న పథకాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేసే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంటింటికీ సంక్షేమం అందించారన్నారు. దీంతో ఏ సర్వే రిపోర్టు చూసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అధికారమని వస్తుందన్నారు. అయితే, ఓర్వలేక పచ్చమీడియ, ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఎందుకు సంపద సృష్టించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ జిల్లాలో జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ద్వారా 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలు గెలుచుకుంటామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా మందికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు కట్టబెట్టారన్నారు. మంచి చేస్తున్న జగనన్నను అందరం కలిసి గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ కరోనా సమయంలో పత్తా లేకుండా పోయిన టీజీ కుటుంబం ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో జనం వద్దకు వస్తుందన్నారు. స్వార్థ రాజకీయ నాయకులకు ఓటుతో తరిమికొట్టాలన్నారు. ఓడిపోతామనే భయంతో వారు పొత్తులు పెట్టుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ కలెక్టర్ ఇంతియాజ్‌బాషా కర్నూలు నియోజకవర్గ అభ్యర్థిగా రావడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యావేత్త, మంచి వ్యక్తి అయిన ఆయనను గెలిపించుకుందామన్నారు. రాష్ట్రంలో ఏడుగురు మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి అవకాశమిచ్చారని చెప్పారు. సామాజిక న్యాయం సీఎంతోనే సాధ్యమన్నారు. కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. నవరత్నాలు రూపొందించడంలో తన వంతు పాత్ర ఉందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నెకల్ సురేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న పాలపళ్ల ఎద్దుల విభాగంలో గెలుపొందిన వృషభాల యజమానులకు మొత్తం ఎనిమిది స్థానాలకు గాను వరుసగా, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 7 గంటలలోపు రూ.600ల ప్రవేశరుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7981016808, 9640643253 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

వ్యాపారి ఆత్మహత్యపై కేసు నమోదు

పగిడ్యాల: అప్పులు బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్న హోటల్ వ్యాపారి లక్ష్మీ నరసింహయ్య మృతిపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ మంగళవారం తెలిపారు. కొంత కాలంగా వ్యాపారం సరిగా జరగడం లేదని, అప్పులు అధికం కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు భార్య ఇందిరమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి, కుటుంబీకులకు అప్పగించామని చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఐదు రోజుల్లోనే దొంగ అరెస్టు

నందికొట్కూరు: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు ఐదురోజుల్లోనే అరెస్టు చేశారు. రూరల్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలంలోని తలముడిపి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్‌గౌస్ ఇంట్లో ఈ నెల 1న చోరీ జరిగింది. బంగారు బ్రస్‌లైట్ 4.5 తులాలు, బంగారు చైన్ 3. 5 తులాలు, 3 తులాల బరువున్న మూడు బంగారు రాళ్ల ఉంగరాలు, బంగారు అభరణాలు, నగదు రూ. 20 వేలు దొంగలించారు. మంగళవారం కర్నూలు రోడ్డు మార్కెట్ యార్డు వద్ద అనుమానంగా తిరుగుతున్న షేక్ మహమ్మద్ హుసేన్‌ను అరెస్టు చేసి విచారించారు. అతని వద్ద చోరీ సొమ్మును రికవరీ చేసి ముద్దాయిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

రోగులకు అందుబాటులో ఉండాల్సిందే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆస్పత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆరోగ్యశ్రీ, ఈ–హాస్పిటల్ అమలుపై సమీక్షించారు. అధిక శాతం విభాగాలు ఆరోగ్యశ్రీ లక్ష్యాలు అధిగమించినందుకు అభినందనలు తెలిపారు. సీటీవీఎస్, ఎండోక్రైనాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ఫ్యామిలి ప్లానింగ్ విభాగాల్లో ఈ–హాస్పిటల్ అమలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని ఎస్ఎల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఆస్పత్రిలోని ఓల్డ్ గైనిక్ విభాగంలో కెమికల్ డిజాస్టర్ యాక్సిడెంట్‌పై మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఆర్ఎంఓ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్సార్బీసీలో పడి మహిళ మృతి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో పడి మహిళ మృతి చెందింది. మంగళవారం ఉదయం కాల్వలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు బయటకు తీశారు. మృతురాలు ఆలమూరు గ్రామానికి చెందిన వెంగమ్మ(65)గా గుర్తించారు. కాల్వలో ప్రమాదవశాత్తు జారి పడిందా లేదా ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై ఎస్ఐ అశోక్ సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విజయవంతంగా పల్స్‌పోలియో కార్యక్రమం



ఇంటికి వెళ్లి పల్స్‌పోలియో కార్యక్రమం గురించి వివరిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని పసుపుల గ్రామంలో జరుగుతున్న డోర్ టు డోర్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటినీ తనిఖీ చేసి ఎవ్వరైనా ఐదేళ్లలోపు పిల్లలు వ్యాక్సిన్ వేసుకోకపోతే వేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటినీ తప్పకుండా సందర్శించాలని సిబ్బందికి సూచించారు. పల్స్‌పోలియో చుక్కలు పిల్లలకు వేయించడం ద్వారా వారు భవిష్యత్‌లో పోలియో బారిన పడి వికలాంగులుగా మారకుండా ఉంటారన్నారు. అనంతరం పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి ట్రాలీ షీట్స్, ఫీల్డ్ షీట్స్, రికార్డులను పరిశీలించి తగిన సలహాలు ఇచ్చారు. మూడు రోజుల్లో పిల్లలకు వంద శాతం టీకాలు వేయాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ భవన్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి విద్యుత్ సదుపాయం ఉందా.. లైన్‌లు బాగా ఉన్నాయా పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శివరాత్రి వేడుకల నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం పరీక్షల సీజన్ నడుస్తుందని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని, దీనిపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషిసఖీలు

- డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు సెర్ప్ కృషి సఖీలను ప్రత్యేకంగా నామినేట్ చేసినట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా అన్నారు. మంగళవారం కర్నూలు శివారులోని డీఆర్‌డీఏ-వైకేపీ శిక్షణ కేంద్రంలో కృషి సఖీలకు 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పెటుబడి లేని వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం ఉద్యమతరహాలో చేపట్టాలని, ఇందులో కృషి సఖీల పాత్ర కీలకంగా మారుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై కృషి సఖీలు అవగాహన పెంచుకొని రైతుల్లోకి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ... కెమికల్స్ వ్యవసాయంతో పెట్టుబడి వ్యయం పెరిగి గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. పండించిన పంటల్లో పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయని, దీంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వ్యవసాయం అవసరం పెరిగిందని చెప్పారు. ఇందులో ఆరోగ్యవంతమైన పద్ధతులు పాటించడం జరుగుతుందని, పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ అవుతుందన్నారు. కార్యక్రమంలో వైకేపీ డీపీఎం నరసమ్మ, ప్రకృతి వ్యవసాయం కన్సల్టెంటు లక్ష్మయ్య, మాస్టర్ ట్రైనర్లు ఆంజనేయులు, సుధాకర్, రంగస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కర్నూలు బ్రాంచిలో పనిచేయుటకు 29 స్త్రీ/పులు కావలెను. జీ:14వేలు+DA 6వేలు+బోనస్+ఫ్రీ రూం. అ:7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F). Opp: శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. సం.ప్ర: 80748 16824. [L-822430]

■ కర్నూలు నందు గల ఒక మెడికల్ షాపులో పనిచేయుటకు మెడికల్ షాపులో పనిచేసిన అనుభవం ఉన్న యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ఆసక్తి గల వారు సంప్ర: 88978 66477. [L-822431]

■ Wanted Accountant for JK Medical Systems. To Work In KURNOOL. Salary: 15k-20k, Experience Min 3yrs. Send Resume to 8328675684 (Whats App). (or) jk medical systems@gmail.com. [L-822429]

■ కార్గో పార్సిల్ కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు గ్రౌండ్ స్టాఫ్; కౌంటర్ స్టాఫ్; కార్గో లోడర్స్, టికెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ప్యాసింజర్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం. వ: 18 నుంచి 32 సం॥, Q: 10th, డిగ్రీ, ITI, డిప్లొమా అల్; 8 గం॥ డ్యూటీ. రూము + ఫుడ్ ఫ్రీ. ✆ 81259 87857 [B-1251813]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 89773 09430 [V-797199]

■ హైదరాబాద్‌లోని Zepto Company లో పనిచేయుటకు డెలివరి బాయ్స్ కావలెను జీతం + వసతి + Bike సౌకర్యం కలదు. సంప్ర॥ ✆ 81255 12079 [O-192183]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 8317512135. [HA-1298]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయుటకు లోడింగ్ సూ॥వైజర్స్, హౌస్ కీపింగ్ సూ॥వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/- రూం+భోజనం ఫ్రీ. ఫోన్: 7093789794. [H-788070]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. Ph: 9160900024/9640400073. [HA-1320]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09185
70750 09165
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-